

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ఆప్‌కీ యాద్ ఆతీ రహీ, రాత్‌భర్**

**చష్మ్ – ఎ – నం ముస్కురాతే రహీ రాత్ భర్**

**ఆప్ కీ యాద్ ఆతీ రహీ....**

హిందీ సినీసంగీత ప్రపంచంలో కొన్ని సినిమా పాటలుంటాయి. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా అవి ప్రజల హృదయాలలో స్థానం సంపాదిస్తాయి. అలాంటి పాటలు రోజూ రేడియోలో వినిపించకపోవచ్చు. శ్రోతలు అధికంగా కోరకపోవచ్చు. కానీ మనసులో ఏదో మారుమూల తమకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకుంటాయి ఆ పాటలు. ఎక్కడ ఏ చిన్న సంఘటన ఆ పాటను మనసు పొరలనుంచి వెలుపలకు తెచ్చినా, కొన్నిరోజుల వరకూ వెంటాడుతూనే ఉంటాయి. విన్న కొద్దీ మరింత వినాలనిపిస్తాయి. మనసులోతుల్లో మనకే తెలియకుండా నిద్రాణ స్థితిలో ఉన్న సున్నిత భావనలను జాగృతం చేస్తాయి. తీయని వేదనను కలిగిస్తాయి. 'గమన్' సినిమాలోని పాటలన్నీ ఇలాంటివే. అలాంటి పాటలలో అగ్రతాంబూలం అందుకుంటూంది 'ఆప్ కీ యాద్ అతీ రహీ ' పాట.

'ఉమ్రావ్ జాన్ ' సినిమాతో పేరు ప్రఖ్యాతులు సాధించిన ముజాఫర్ ఆలీ మొదటి సినిమా 'గమన్'. ముజాఫర్ ఆలీకి ఉర్దూ సాహిత్యం అంటే ఎంతో మక్కువ. అందుకే సాంద్రదాయకమైన గీతాలు వాడుకున్నాడు. కవి 'షహర్‌యార్'తో పాటలు రాయించాడు. ఒక్క పాట మఖ్దూం మొహియుద్దీన్ రాసిన కవితలలోంచి ఎంచుకున్నాడు. 'షహర్యార్' రాసిన పాటలన్నీ సంగీత పరంగా, సాహిత్య పరంగా అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. 'సీనేమే జలన్ ', 'అజీబ్ సనేహా ముఝ్ పర్ గుజరా' వంటి పాటలు, ఆనాటి డిస్కో యుగం హోరులో జోరులో ప్రజల హృదయాలపై చిరుజల్లు కురిపించాయి. చక్కటి సంగీతం కోసం తపిస్తున్న వారి దాహం తీర్చాయి. ఒకరకంగా 'గజల్ క్రేజ్' ప్రజలలో పెరిగేందుకు మార్గం సుగమం చేశాయి 'గమన్' పాటలు.

'గమన్' సినిమా సంగీత దర్శకుడు జయదేవ్. కొత్త గొంతులకు ప్రోత్సాహం ఇవ్వటానికి పెట్టింది పేరు జయదేవ్. అందుకే సురేష్ వాడ్కర్‌కు గుర్తింపు పాటగా ఎదిగింది 'సీనేమే జలన్' పాట. ఇప్పుడు పేరుపొందిన గాయకుడు 'హరిహరన్' తొలి సినిమా పాట 'అజీబ్ సనేహా', 'ఆప్ కీ యాద్ అతీ రహీ' పాట పాడింది ఛాయా గంగూలీ. ఇది ఈమె తొలిపాట. ఈ పాటకు ఆమెకు జాతీయ ఉత్తమ గాయని అవార్డు ఆ సంవత్సరానికి లభించింది.

'ఆప్‌కీ యాద్ ఆతీ రహీ' పాట మరుపురాని పాటగా ఎదగటంలో ఛాయాగంగూలీ పాటను పాడిన విధానం ప్రముఖమైన పాత్ర పోషించినా, జయదేవ్ బాణీ ఆమె స్వరం అంత గొప్పగా భావాలను పలికించటంలో ఎంతో తోడ్పడింది. అతి తక్కువ వాయిద్యాలతో 'భైరవి' రాగంలో ఈ పాటను రూపొందించటం పాట ప్రేక్షకుల మనస్సులను కదిలించటంలో ప్రధాన పాత్ర పోషించేందుకు భూమికను సిద్ధం చేసింది. 'రాత్ భర్' అని 'రా' దగ్గర దీర్ఘం తీసి 'భర్' దగ్గర ఒత్తిపలికి పాటలోని విరహవేదనను గానం ద్వారా అనుభవానికి తెస్తుంది ఛాయాగంగూలీ స్వరం. పాట చిత్రీకరణ కూడా అర్ధవంతంగా వుండి పాట ప్రభావాన్ని ఇనుమడింపచేస్తుంది. అయితే అన్నిటికన్నా మఖ్దూం కవితను ఈ సందర్భానికి ఎంచుకోవటం తోటే, పాట మరుపురాని పాటగా నిలుస్తుందన్నది స్పష్టం అయిపోయింది.

రాత్రంతా నీ జ్ఞాపకాలు వస్తూనే ఉన్నాయి. అన్నది పల్లవి మొదటి పాదం. మామూలుగా అనిపిస్తుంది. కానీ బాణీని మార్చిన విధానం, ఛాయా గంగూలీ స్వరంలో పలికే భావం, పదాలను దీర్ఘం తీసి, ముర్కీలు వేసి పాడిన విధానం పాట ఆరంభం నుంచీ అలరించే వీలును కల్పిస్తాయి.

పొట్టకూటి కోసం పట్టణం వస్తాడు హీరో. తల్లి, భార్య ఇంట్లో అతని ఉత్తరం కోసం ఎదురు చూస్తూంటారు. అతడినుంచి ఉత్తరం వస్తుంది. అత్తగారికి ఉత్తరం చదివి వినిపించిన అతని భార్య, నిదుర రాని రాత్రి ఒంటరిగా కూర్చుని ఆ ఉత్తరాన్ని చదువుకుంటుంది .దాన్లో తన గురించి రాసిన వాక్యాల్ని చదివి అతడిని గుర్తుచేసుకుంటూంటుంది. పాట ఆరంభమవుతూనే, నాయకుడు డబ్బు లెక్కించే దృశ్యం తెరపై కనిపిస్తుంది. డబ్బు ఎలా మనుషులను వేరు చేస్తోందో, మమతలను పరీక్షిస్తోందో, ప్రేమించిన హృదయాలను వేదనకు గురిచేస్తోందో అతి సున్నితంగా ప్రదర్శిస్తుందీ దృశ్యం. భార్య పాత్ర పోషించిన 'స్మితాపాటిల్ ' వదనం ప్రదర్శించే భావాలను, కళ్ళల్లో కనిపించే భావనలను గురించి చెప్పనవసరంలేదు. పాట ఆరంభమవుతూనే మనసుకు పట్టేస్తుంది. జీవితాంతం వదలదు.

పల్లవిలోని రెండవ పాదంలో 'చష్మ్ – ఎ – నం' అన్న పద ప్రయోగం చేశాడు మఖ్దూం. 'చష్మ్' అంటే ఒక అర్ధం 'కళ్ళు' అని. 'నం' అంటే, తడి, తేమ అన్న అర్ధాలు వస్తాయి అప్పుడప్పుడు మంచుబిందువు వల్ల కలిగే 'చెమ్మ'ను కూడా

సూచిస్తుందీ పదం. 'చష్మ్ – ఎ – నం' అంటే 'చెమ్మగిల్లిన నయనాలు' అనుకోవచ్చు. అంటే, చెమ్మగిల్లిన నయనాలు మందహాసం చేస్తూనే ఉన్నాయి అన్నమాట. అతని జ్ఞాపకాలలో ఆమె నయనాలు చెమ్మగిల్లాయి. కానీ, అతడు గుర్తుకు వచ్చి మనసుకు కలిగిన ఆనందంతో ఆమె సంతోషిస్తోంది. పెదవులపై చిరునవ్వు నిలిచింది. 'చష్మ్ – ఎ – నం' 'ముస్కురాతీ రహీ' అంటే ఒక వైపు నుంచి ఈ అర్థం చెప్పుకోవచ్చు. మరోవైపు 'చష్మ్' అంటే ఆశ, ఊహ అన్న అర్థాలు కూడా ఉన్నాయి. ఈ అర్థాల దృష్టితో చూస్తే, ఒకవైపు ఆశ, మరోవైపు అతడు తిరిగి వస్తాడన్న భావనతో ఆమె హృదయం సంతోషిస్తోంది, మరోవైపు అతడు దగ్గర లేకపోవటం వల్ల కలిగిన దుఖం వల్ల, అతని జ్ఞాపకాలతో ఆమె కళ్లు తడి అయ్యాయి అన్న అర్థం కూడా తీసుకోవచ్చు.

రెండో పాదం విన్న తరువాత కళ్లల్లో నీటి పొర కదలాడుతుంది. హృదయంలో అలవికాని మధుర బావన కలుగుతుంది. కళ్లు తడిగా వున్నా మనసు మందహాసం చేస్తుంది. దాంతోపాటు మళ్లీ మళ్లీ విని వేదనలోని ఆనంద భావనను అనుభవించాలనిపిస్తుంది. దీనికి తోడు అతి తక్కువ వాయిద్యాలతో, గాయిక స్వరానికి ప్రాధాన్యం ఇవ్వటంతో పాట ప్రభావం మరింత పెరుగుతుంది.

**రాత్ భర్ దర్ద్ కీ షమ్మ జల్తీ రహీ**

**ఘం కి లౌ థర్థరాతీ రహీ, రాత్ భర్**

రాత్రంతా వేదన దీపమై కాలుతూనే ఉందట. విషాదపు జ్యోతి రెపరెపలాడుతూందట. అత్యద్భుతమైన ప్రతీకలతో ఆశ, నిరాశల నడుమ ఊగులాడే మానసిక స్థితిని వర్ణించాడు కవి.

దర్ద్‌కీ షమ్మ ' 'షమ్మ' అంటే దీపం. 'దర్ద్ కీ షమ్మ' రాత్రంతా దీపం వెలుగుతూండటం, మెలుకువగా ఉండటాన్ని సూచిస్తుంది. 'దర్ద్‌కీ షమ్మ' అంటే వేదనా భరితమైన దీపం వెలుగుతూనే ఉందట. అంటే ఆమె హృదయం అతని జ్ఞాపకాలతో రాత్రంతా రగులుతూనే ఉందట. 'ఘం కి లౌ, ' 'ఘం' అంటే దుఃఖం 'లౌ' అంటే ఫ్లేం. జ్యోతి. ఆమె హృదయం వేదనతో కాలుతూంటే దుఖం జ్యోతి వణుకుతూ, రెపరెపలాడుతోందట. కవి ప్రదర్శించిన భావం వల్ల హృదయంలో అద్భుతమైన భావం ఎగసి పడుతుంది. 'లౌ' అంటే జ్యోతి అన్న అర్థంతోపాటు, అనుబంధం, ప్రేమ, ఆప్యాయత తీవ్రమైన కోరికలు, ఆశనిరాశల నడుమ ఊగిసలాడుతున్నాయన్న మాట. 'థర్ థరానా' అంటే కంపించటం.

ఈ పాదం తరువాత వినిపించే మురళీరవం అత్యద్భుతంగా ఉంటుంది. జయదేవ్ సంగీత సృజనలో వాయిద్యాల వాడకంలోని ఔచిత్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. వాయిద్యాల ద్వారా దృశ్యాలను కళ్లముందు నిలిపే జయదేవ్ ప్రతిభకు 'ప్రేమ్ పర్బత్' సినిమాలోని 'యె దిల్ ఔర్ ఉన్కీ' పాట, 'రేష్మా ఔర్ షేరా'లోని 'తూ చందా మై చాంద్నీ', 'ఏక్ మన్‌కి తపన్' వంటి పాటలు అత్యద్భుతమైన నిదర్శనాలు. వేణు వాయిద్యం వినిపించటానికీ, పాటలో తరువాత వినిపించే చరణానికి సంబంధం ఉంటుంది.

**బాంసురీ కీ సురీలీ సుహానీ సదా**

**యాద్ బన్ బన్ కె ఆతీ రహీ, రాత్ భర్.**

రాత్రంతా పదే పదే వేణువు పలికే మధురమైన నాదం జ్ఞాపకమై పదే పదే గుర్తుకు వస్తోందట. చక్కటి ఊహ.

**యాద్ కె చాంద్ దిల్ మే ఉతర్తే రహే**

**చాంద్‌నీ జగ్మాగతే రహీ, రాత్ భర్.**

జ్ఞాపకాల చంద్రుడు హృదయంలో నిండిపోతూన్నాడట. రాత్రంతా వెన్నెల జాజ్వల్యమాన్యంగా ప్రకాశిస్తూనే ఉంది. సర్వం ప్రతీకల మయం.

**కోయి దీవాన గలియోమె ఫిర్తా రహా**

**కోయి అవాజ్ ఆతీ రహీ, రాత్ భర్....**

ముగింపు చరణం ఇది. పంచ్‌లైన్ అన్నమాట. ఎవరో పిచ్చివాడు రాత్రంతా వీధిలో తిరుగుతూనే ఉన్నాడట. రాత్రంతా ఏదో పిలుపు వినిపిస్తూనే ఉన్నదట. అర్ధవంతమైన చరణం ఇది. సాధారణంగా ప్రియుడు, ప్రియురాలి ఇంటిచుట్టూ తిరుగుతుంటాడు. ఆమెని రహస్యంగా పిలుస్తూంటాడు. ఇక్కడ అతని జ్ఞాపకాలు ఆమె చుట్టే తిరుగుతూన్నాయి. ఆమెని పిలుస్తూ అతడి జ్ఞాపకాలను గుర్తుచేస్తూనే ఉన్నాయి. ఆమె మనస్సు అతని చుట్టే తిరుగుతూ అతడిని పిలుస్తోంది రాత్రంతా. ఇలా పలు అర్థాలనిస్తుంది ఈ చరణం. విరహవేదనను ఇంత అందంగా, అనుభవైక వేద్యంగా ప్రదర్శించటం అందరికీ సాధ్యంకాదు. ఈ చరణం చిత్రీకరణలో నాయకుడు డబ్బు సంపాదనకోసం వీధుల్లో టాక్సీ నడుపుతూంటాడు. ఇక్కడ డబ్బు వేటలో ఒక పిచ్చివాడు, తనని తాను మరచి పిచ్చివాడిలా వీధుల్లో

తిరుగుతున్నాడన్న అర్ధం కలిగిస్తుంది దృశ్యం. పిచ్చివాడెందుకంటే, అసలు ప్రేమ తల్లినీ, భార్యనూ ఊళ్ళో వదలి నగరం వీధుల్లో అందని మృగతృష్ణ అయిన డబ్బు వెంట పడుతున్నాడు కాబట్టి.

ఎదురు చూపులు, జ్ఞాపకాల ఒంటరి వేదనను ప్రదర్శించటంలో కవి ఎక్కడా అతిశయోక్తులు వాడలేదు. నువ్వు రాకపోతే ఎదురుచూస్తూ  చస్తానన్న నాటకీయ భావాలు లేవు. ఆశల దీపం రెపరెపలాడుతోంది. నీ జ్ఞాపకాలు నాలో భాగమైపోయాయి. ఆ జ్ఞాపకాల వెన్నెలలా  విరబూస్తూ, విరహవేదనను పెంచుతున్నాయి. నా ఆలోచనలు నీ చుట్టే పిచ్చివాడిలా తిరుగుతూ, నిన్ను పిలుస్తున్నాయి. ఆ పిలుపులతో రాత్రంతా నాకు నిదరపట్టలేదు, నీ ఆలోచనలే రాత్రంతా వస్తూన్నాయి. అంటూ అత్యంత సాధారణమైన రీతిలో, అత్యద్భుతమైన ప్రతీకలతో, తన భావనలను ఇతరులపై ఆరోపిస్తూ మఖ్దూం  కవితను రచించిన తీరు ముగ్ధులను చేస్తుంది.

సినిమాలో సరైన సందర్భానికి సరైన కవితను ఎంచుకుని సినీ గేయ ప్రపంచానికి అద్వితీయమైన గీతాన్ని అందించారు ముజఫర్ ఆలీ, 'జయదేవ్'లు. 'గమన్' సినిమా నానాపటేకర్ తొలి హిందీ సినిమా. ఈ పాట పాడినందుకు ఛాయా గంగూలీకి , బాణీని కూర్చినందుకు 'జయదేవ్'కికూడా అత్యుత్తమ  జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. 'మఖ్దూం' ఈ కవిత ఎంత ప్రాచుర్యం పొందిందంటే మఖ్దూం మరణించినప్పుడు ఈ కవితను అనుకరిస్తూ, ప్రఖ్యాత కవి 'ఫైజ్ అహ్మద్ ఫైజ్' తన కవిత ద్వారా మఖ్దూంకు శ్రద్ధాంజలి అర్పించాడు.

**ఆప్ కీ యాద్ అతీ రహీ, రాత్ భర్**

**చాంద్‌ని దిల్ దుఖాతే రహీ రాత్ భర్**

రాత్రంతా నీ జ్ఞాపకాలు వస్తూనే ఉన్నాయి.  వెన్నెల నా హృదయాన్ని దుఃఖింప చేస్తూనే వుంది.

**గాహ్ జల్తీ హుహీ  గాహ్ బుఝ్‌తీ హుయీ**

**షం – ఎ – ఘం ఝిల్‌మిలాతీ రహీ,  రాత్ భర్**

అప్పుడప్పుడు హృదయం మండుతూ, అప్పుడప్పుడు తగ్గుతోంది. అంటే వేదన ఒకోసారి భరించలేనంతగా మరోసారి కొద్దిగా తగ్గుతోందట. 'షం' అంటే 'షమ్మా ' అని అర్ధం. ఆ వేదన జ్వాల రాత్రంతా వెలుతుతూనే ఉందన్నమాట. ఇప్పుడు మొదటి పాదంతో అన్వయించుకుంటే,ఈ వేదన జ్వాల ఒకోసారి వెలుగుతూ, ఒకోసారి దాదాపుగా ఆరినట్టు

తగ్గుతూ, రాత్రంతా ఇలా వెలుగుతూనే ఉందట. ఆ వేదన అతడిని నిలవనీయటంలేదు. వేదన నిరంతరం ఉంటే అది అలవాటయిపోతుంది. కానీ హెచ్చి,తగ్గుతూంటే అది భరించటం కష్టం. ఆ వేదన అలవాటుకాదు. నిలవనీయదు. మఖ్దూం మరణం, ఫైజ్‌ను అంతగా బాధించిందన్నమాట.

**కోయి ఖుష్బూ బదల్తీ రహీ పైరహన్**

**కోయి తస్వీర్ గాతీ రహీ, రాత్ భర్**

'పైరహన్' అంటే దుస్తులు అన్న అర్దం ఉంది. 'పైరహన్' అంటే దుస్తుల పైన తొడిగే నల్లటి పెద్ద కోటు అన్న అర్దం వస్తుంది. ఏదో పరిమళం ఇలా దాక్కుని, కనిపిస్తూ ఉందట. ఏదో చిత్రం రాత్రంతా పాడుతోందట. ఇక్కడ ఖుష్బూ, తస్వీర్ లను ప్రతీకలుగా వాడాడు ఫైజ్. పరిమళం అనుభవించాలి అది కనిపించదు. 'తస్వీర్' కనిపిస్తుంది. అతడి రూపం కనిపిస్తోంది కళ్లముందు. కానీ అతడు నిజంగా లేడు. కానీ అతని పాట (కవిత) వినిపిస్తుంది. ఆ కవితల పరిమళం తెలుస్తోంది. మఖ్దూం స్థాయికి తగిన నివాళి.

**ఫిర్ సబా –సాయా – ఏ – శాఖ్ – ఏ – గుల్ కె తలే**

**కోయి ఖిస్సా సునాతీ రహీ, రాత్ భర్**

'సాయా – ఏ – రఖ్ – ఏ గుల్ ' అంటే పరిమళ భరితమైన పూల గుత్తులున్న శాఖ' అని అర్థం. అలాంటి చెట్టుకొమ్మ క్రింద, 'సబా' అంటే 'వాయువు' 'చిరుగాలి' అని అర్థం. అలాంటి పరిమళభరితమైన పూల గుత్తులున్న కొమ్మ క్రింద చిరుగాలి ఏదో కథను రాత్రంతా వినిపిస్తూనే ఉందట చిరుగాలి. ఎక్ చమేలీ కే మండ్వే తలే అనే మఖ్దూం కవితను గుర్తుకుతెస్తూ రాసిన పాదాలివి. మల్లెతీగ నీడలో ఇద్దరు ప్రేమికుల శరీరాలు ప్రేమాగ్నిలో జ్వలిస్తున్నాయంటూ ప్రేమ గాథను చెప్తుందా కవిత. అందుకే రాత్రంతా పరిమళభరితమైన కొమ్మ నీడన కథ చెప్తూనే వుందన్నాడు ఫైజ్.

**జోన ఆయా ఉసే కోయి – జంజీర్ – ఏ దర్**

**హర్ సదా పర్ బులాతీ రహీ, రాత్ భర్**

'జంజీర్ – ఏ – దర్ ' అంటే తలుపుకున్న గొళ్లెం ' ఎవరయితే రాడో ప్రతి సవ్వడికీ, అతడే వస్తున్నాడని తలుపు గొళ్లెం పిలుస్తూనే ఉందట రాత్రంతా.

**ఏక్ ఉమ్మీద్ సె దిల్ బహల్తా రహా**

**ఇక్ తమన్నా సతాతీ రహీ, రాత్‌భర్.**

ఒక ఆశ హృదయాన్ని ఆనందింపచేస్తోందట. ఒక కోరిక రాత్రంతా బాధిస్తూనే ఉందట. అతడు వస్తాడన్న ఆశ, అతడు రావాలన్న కోరిక అన్నమాట. ఇది 'మఖ్దూం' కవితలను ఆధారం చేసుకుని అతడి కవితను అనుసరిస్తూ మఖ్దూంకు ఫైజ్ సమర్పించిన నివాళి.

ఉత్తమమైన సాహిత్యం ఉత్తమమైన స్పందనలకు కారణమౌతుంది. అందుకనే కవులు సాహిత్యాన్ని సరస్వతిలా పూజిస్తూ, ధ్యానిస్తూ అత్యంత పవిత్రమైన భావనతో అత్యుత్తమమైన సాహిత్యాన్ని సృజించారు. ఆ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయటం ద్వారా, తరతరాలకు జ్ఞాపకం చేయటం ద్వారా, ఉత్తమ భావనలను సమాజంలో విస్తరింపచేయవచ్చు. హిందీ సినీ కళాకారులు ఈ పనిని సమర్ధవంతంగా చేశారు. ప్రసిద్ధ కవుల కవితలను సినీగీతాలుగా మలచి సామాన్యుడు సైతం, అనుభవించి, ఆనందించే వీలును కల్పించారు. అందుకే 'రాత్‌భర్' మాత్రమే కాదు ,'జిందగీ భర్ ' (జీవితాంతం) ఆనాటి కళాకారులను తలుచుకుంటూంటాం.

(వచ్చేనెల మరిన్ని ఉర్దూ కవితల పాటలతో కలుద్దాం..)

Click here to share your comments